క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక



సునీల్‌కు పార్టీ కండువా కప్పిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

రామచంద్రాపురం(పటాన్‌చెరు) తెల్లాపూర్ పీఏసీఎస్ డైరెక్టర్ సునీల్ బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవీణ్‌కుమార్‌పై ఉన్న అభిమానంతో గతంలో బీఎస్పీలో చేరినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో తెల్లాపూర్ పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విత్తనాలు అందిస్తాం



రైతులకు సర్టిఫికెట్‌లను అందజేస్తున్న బుచ్చిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, రుణాలు అందిస్తామని తెల్లాపూర్ పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రైతువేదికలో శనివారం పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలను అందిస్తున్నామన్నారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం పీఏసీఎస్ సభ్యత్వం తీసుకున్న రైతులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్లు లచ్చినాయక్, మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నీటి పొదుపుపై అవగాహన



మాట్లాడుతున్న ధనుక అగ్రిటెక్ లిమిటెడ్ అధికారులు

కోహీర్(జహీరాబాద్): నీటిని పొదుపుగా వినియోగించాలని ధనుక అగ్రిటెక్ లిమిటెడ్ అధికారులు పూర్ణచందర్‌రావు అన్నారు. నీటి పొదుపు వారోత్సవాలను పురస్కరించుకొని కోహీర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నీటి పొదుపుపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీటిని వృథా చేయకుండా కురిసిన ప్రతి నీటిబొట్టునూ భూమిలో ఇంకిపోవడానికి అవసరమగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నీటి పొదుపుపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ధనుక కర్మాగారం అధికారులు చక్రధర్, జీషాన్, రామకృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముకుంద్ శిల్పి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశ్రమకు తాళం



పరిశ్రమ గేట్‌కు తాళం వేస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని పరిశ్రమల నుంచి అధికారులు పన్నులను వసూలు చేస్తున్నారు. భారీగా పన్ను బకాయిలు ఉన్న పరిశ్రమలపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు పన్ను చెల్లించనందుకు గాను మున్సిపల్ అధికారులు శనివారం బొల్లారంలోని సుజనా స్టీల్స్ యూనిట్-4 పరిశ్రమకు తాళం వేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు తప్పనిసరిగా పన్నులను చెల్లించాలన్నారు. లేనిపక్షంలో పరిశ్రమాలను మూసివేస్తామని తెలిపారు.

రఘునందన్‌రావుపై ఈసీకి ఫిర్యాదు

సంగారెడ్డి: మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిపై మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్‌కు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శనివారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినవారిలో నాయకులు కాసాల బుచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

అదనపు సబ్‌స్టేషన్ ఏర్పాటయ్యేనా?

రామచంద్రాపురం పట్టణంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగదారులకు అనుగుణంగా సబ్‌స్టేషన్ లేకపోవడంతో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఉన్న ఒక్కటే సబ్‌స్టేషన్‌పై పరిమితికి మించి భారం పడుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు 12ఏళ్ల క్రితం అదనంగా 35కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేశారు. కానీ..నేటికీ అధికారులు స్థలం కేటాయింపులో తీవ్ర జాప్యం వహిస్తుండటంతో సమస్యలు తప్పడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్థలాన్ని గుర్తించి అదనపు సబ్‌స్టేషన్‌ను నిర్మించాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)



రామచంద్రాపురం పట్టణంలోని 35కేవీ సబ్‌స్టేషన్

- 12ఏళ్ల క్రితమే మంజూరైనా నేటికీ స్థలం కేటాయించని వైనం
- 44,905 వినియోగదారులకు ఒకటే సబ్‌స్టేషన్
- తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వినియోగదారులు

రామచంద్రాపురం పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో రామచంద్రాపురం పరిధిలోనే కాలనీలు, భీరంగూడ పరిధిలోని పలు కాలనీలు ఉన్నాయి. రామచంద్రాపురం పట్టణ పరిధిలో 20433 మంది వరకు విద్యుత్ వినియోగదారులు ఉండగా భీరంగూడ పరిధిలో 24472 మంది వినియోగదారులు ఉన్నారు. దీంతో ఉన్న ఒకే సబ్‌స్టేషన్‌పై అదనంగా విద్యుత్ భారం పడి తరచూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోందని వినియోగదారులు వాపోతున్నారు.

విద్యుత్ వినియోగం అధికం

రోజురోజు కాలనీలు, వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్‌లు పెరుగుతుండటంతో విద్యుత్ వాడకం మరింత పెరిగింది. వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఉన్న ఒకే సబ్‌స్టేషన్‌పై అదనంగా ఎక్కువ భారం పడుతోంది. ఇక వేసవిలో ఏసీలు, కూలర్ల వాడకం వలన సబ్‌స్టేషన్‌పై మరింత భారం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

రూ.2కోట్ల నిధుల మంజూరు

12ఏళ్ల క్రితం రామచంద్రాపురం పట్టణంలో 35కేవీ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు రూ.2కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆ సమయంలో అప్పటి ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం పలు స్థలాలను పరిశీలించారు. సాంకేతిక కారణాల కారణంగా స్థలం కేటాయింపు జరగడం లేదని దాటవేస్తూ వస్తున్నారు. స్థలం కోసం బీహెచ్ఈఎల్ యాజమాన్యంను సైతం సంప్రదించారు. కానీ ఫలితం లభించలేదు. ఈఎస్ఐ ప్రాంగణంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేశారు. అది కూడా విఫలమైంది.

ముందస్తు చర్యలు తీసుకోవాలి



వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి. గత వేసవికాలంలో విద్యుత్ కోతలు తప్పలేదు. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దీంతో అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి. లేదంటే కరెంట్ కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

– నాగభూషణం, రామచంద్రారెడ్డినగర్ కాలనీ,

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం

రామచంద్రాపురం పట్టణానికి సబ్‌స్టేషన్ మంజూరైంది. కానీ.. నిర్మాణం కోసం స్థలం కేటాయింపు జరగలేదు. స్థలం కేటాయింపు పూర్తి కాగానే సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు వెంటనే చేపడతాం. అప్పటివరకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలి.

– తులసీరాం, ఏడీ, రామచంద్రాపురం

అదనపు సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి



పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. ఉన్న ఒకే సబ్‌స్టేషన్‌తో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. అదనపు సబ్‌స్టేషన్ మంజూరైనా ఇప్పటివరకూ స్థలాన్ని కేటాయించకపోవడం విచారకరం. విద్యుత్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సబ్‌స్టేషన్‌కు స్థలాన్ని కేటాయించి నిర్మాణం చేపట్టాలి.

– బలరాం, రామచంద్రాపురం

తప్పుల తడకగా సూచిక బోర్డు

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం పట్టింపు లేనితనంతో తెలుగులో సైతం అక్షరదోషాలు కనిపిస్తున్నాయి. మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామ శివారులో గ్రామాల పేర్లను సూచిస్తూ బోర్డును ఏర్పాటు చేశారు. సూచిక బోర్డులో బర్దిపూర్‌కు బదులుగా బరిదపూర్ అని రాసి ఉంది. ఇంగ్లీషులో ఉన్న బోర్డు సరైన విధంగా ఉన్నప్పటికీ తెలుగులో మాత్రం తప్పుగా ఉంది. విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సూచిక బోర్డులోని పేరును సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



తప్పుగా రాసి ఉన్న సూచిక బోర్డు

విద్యారంగ సమస్యలపై సమీక్షించండి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినికాంత్

సంగారెడ్డి అర్బన్: ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై సమీక్షించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మహేష్ అన్నారు. సంగారెడ్డి జిల్లా 6వ మహాసభ రాయల్ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికొదిలేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రకటించిన మెగా డీఎస్సీలో న్యాయపరమైన ఆటంకాలు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి రమేష్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమెల మాణిక్, జిల్లా కార్యదర్శి రమేష్, రాజేష్, సతీష్, వాణి, నేహారెడ్డి, శ్రీనివాస్, స్వప్న, శ్రీనివాస్, హరీష్, పవన్, విష్ణు, కిరణ్‌గౌడ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం తక్షణమే పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ రాజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ చంద్రప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాలలో ఆరు నెలల నుంచి కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. దీంతో కార్మికుల కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు యూనిఫామ్, సబ్బులు సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామ పంచాయతీ డివిజన్ నాయకులు వెంకయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు సంజీవులు, కిషన్, కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

టెట్ ఆన్‌లైన్ ఫీజు తగ్గించాలి



మాట్లాడుతున్న కుమార్

నారాయణఖేడ్: టెట్ ఆన్‌లైన్ ఫీజు తగ్గించాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి తెంకటి కుమార్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లో శనివారం నిర్వహించిన సంఘ డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజును పెంచడంతో నిరుద్యోగులకు భారంగా పరిణమించిందన్నారు. గతంలో ఒకపేపర్ రాస్తే రూ.200, రెండు పేపర్లు రాస్తే రూ.400 ఫీజు ఉండేదన్నారు. ప్రస్తుతం ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున ఫీజు పెంచడం బాధాకరమన్నారు. ఇప్పటికే రూ.వేలు వెచ్చించి కోచింగ్ తీసుకోగా పెంచిన ఫీజు మోయలేని భారంగా పరిణమించిందన్నారు. సంఘ నాయకులు పవన్, రాహుల్, రాకేష్, అమర్, బన్నీ పాల్గొన్నారు.

రహదారిగా విస్తరించండి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నుంచి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ వెళ్లే అర్అండ్‌బీ రోడ్డును నాలుగు లేన్లుగా రహదారిగా విస్తరించాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్‌లో శనివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇంద్రేశం, ఐనోల్, పేదకంజర్ల గ్రామాల పరిధిలో అర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టి రహదారిని విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మూర్తి, జయకుమార్, చంద్రకిరణ్, వెంకటేశ్వరరావు, సత్తిరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నీలం మధుకు మద్దతు

పటాన్‌చెరు: మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌కు మెదక్ పార్లమెంట్ పరిధిలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాల నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్ శ్రేణులు, సబ్బండ కుల సంఘాలు, మహిళలు నీలంకు మద్దతు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రజల కష్టాలు తెలిసిన నీలం మధు లాంటి వ్యక్తి పార్లమెంట్‌కి వెళ్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తామంతా స్వచ్ఛందంగా ప్రచారం చేసి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.



నీలం మధును కలిసిన కాంగ్రెస్ నాయకులు

సగరుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: సగరుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. నారాయణఖేడ్‌లో శనివారం సగరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సగరులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సగరుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సగర మాట్లాడుతూ నారాయణఖేడ్‌లో సగరుల భవనాన్ని నిర్మించాలన్నారు. సమావేశంలో సగరుల నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అంజయ్య, తాలుకా అధ్యక్షుడు బాల్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, శరత్‌సాగర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డికి సగర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

క్యాట్ పరీక్షలో విద్యార్థినుల ప్రతిభ



విధిత



అఖిల



రేచెల్



జ్ఞానేశ్వరి

మునిపల్లి(అందోల్): క్యాట్ పరీక్షలో మండలంలోని బుదేరా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనపర్చినట్లు మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆరిఫా తెహసీన్ అరా తెలిపారు. ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీల్లో /2024 సంవత్సరానికి గాను క్యాట్ పరీక్షలో ఉత్తీర్ణత పొంది పీజీ ప్రవేశాలకు అర్హత సాధించిన రేచెల్, జ్యోతి, విధిత, అఖిలను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఘనంగా రన్ ఫర్ జీసెస్

సంగారెడ్డి: సంగారెడ్డిలో యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఫోరం ఆధ్వర్యంలో ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్ పాల్గొని క్రైస్తవ సోదరులకు ముందస్తు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఫాదర్ ఇన్నారెడ్డి భక్తులకు దైవ సందేశం అందించారు.

మహిళ అదృశ్యం

సదాశివపేట(సంగారెడ్డి): మహిళ అదృశ్యమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. సీఐ మహేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన కంది శ్రీలత అదే గ్రామానికి చెందిన బేగరి శాంతమ్మతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటలకు సెయింట్ అంథోనిస్ స్కూల్ బస్సులో సదాశివపేట పట్టణంలోని స్కూల్‌వద్ద బస్సు దిగి అక్కడి నుంచి సిద్దాపూర్‌గాని వరకు ఆటోలో వెళ్లారు, అక్కడి నుంచి శ్రీలత తాను సిద్దాపూర్ కాలనీలోని తన తల్లిగారి ఇంటికి వెళ్తానని శాంతమ్మకు తెలిపి వెళ్లింది. కానీ.. ఆమె తల్లిగారి ఇంటికి వెళ్లకపోవడంతో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కంది శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

వట్‌పల్లి(అందోల్): అనుమానాస్పదంగా వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం అందోలు మండల పరిధిలోని నేరడిగుంట గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ-2 మొగులయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని డాకూర్ గ్రామానికి చెందిన ఇందూరి యాదయ్య నేరడిగుంటలోని తన అత్తగారి ఇంటి వద్ద కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్తున్నానని భార్యతో చెప్పి వెళ్లాడు. గ్రామ శివారులోని ఏడెద్దుల కుంటవాగులో మొగులయ్య శవమై కనిపించడంతో స్థానికులు గ్రామస్తులకు సమాచారం అందించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా ఇఫ్తార్ విందు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌కాలనీలో శుక్రవారం రాత్రి తెల్లాపూర్ మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ నిర్వహించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఎల్లయ్య, కౌన్సిలర్‌లు లచ్చిరాంనాయక్, బాలజీ, శ్రీశైలం, నాగరాజు, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, నగేష్, శ్రీకాంత్‌రెడ్డి, ఉమేష్ పాల్గొన్నారు.

రహమత్‌నగర్ కాలనీలో...

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని రహమత్‌నగర్ కాలనీలో శ్రీసాయి ఆసుపత్రి యజమాన్యం నాగశ్రీ, ప్రవీన్‌కుమార్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షమీ, నాయకులు పాల్గొన్నారు.

సంగారెడ్డి పట్టణంలో...

సంగారెడ్డి: పట్టణంలో నిర్వహించిన ఇఫ్తార్‌విందులో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు, టీఐఐసీసీ చైర్మన్ నిర్మలారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో 24వ వార్డుసభ్యుడు మహమ్మద్ షఫి, కాంగ్రెస్ నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

◆ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ గ్రామంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దేవాలయ ఈఓ శశిధర్ గుప్తా ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తహసీల్దార్ గంగాభవానీ, దేవాలయ సిబ్బంది సోమయ్య, రవీంద్రమూర్తి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, వేణు, నర్సింగ్‌రావు, గోవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ ఆర్థికసాయం అందజేత



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధికి చెందిన కుటుంబానికి లక్ష్మన్న కుటుంబానికి ఎరుకల సంఘం నాయకులు శనివారం ఆర్థికసాయం అందచేశారు. ఈ నెల 10 గ్యాస్ సిలిండర్ పేలిన సంఘటనలో లక్ష్మన్నతో పాటు ఆయన మనుమరాలు కీర్తి తీవ్రంగా గాయపడి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. లక్ష్మన్నది నిరుపేద కుటుంబం కావడంతో తెలంగాణ రాష్ట్ర ఎరుకల సంఘం జహీరాబాద్ అధ్యక్షుడు మహేష్, శివరాజ్, కిష్టయ్య తదితరులు లక్ష్మన్న భార్యకు రూ.35వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బరూర్ దత్తాత్రి, నాయకులు నారాయణ, పెంటన్న, తుకారాం, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

◆ ఖజానా కార్యాలయానికి సెలవు లేదు

సంగారెడ్డి టౌన్: సంవత్సరం చివరి రోజు ఆదివారం ఖజానా కార్యాలయానికి సెలవు లేదని, కార్యకలాపాలు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతాయని ఖజానాశాఖ జిల్లా ఉపాసంచాలకులు కవితకుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటల వరకు ఏవైనా బిల్లులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ చెరిస్ కార్మికుడు అదృశ్యం



మిథిలేష్‌కుమార్

సదాశివపేట(సంగారెడ్డి): మండల పరిధిలోని చెరిస్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుడు అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రంలోని బెగుసరాయ్ జిల్లా నాన్‌పూర్ గ్రామానికి చెందిన మిథిలేష్‌కుమార్ మండల పరిధిలోని చెరిస్ పరిశ్రమలో రెండు నెలలుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 23న మిథున్‌కుమార్, మిథిలేష్ కుమార్ ఇద్దరు కలిసి ఎప్పటిలాగే చెరిస్ పరిశ్రమలో పనిచేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఎవరికీ చెప్పకుండా మిథిలేష్‌కుమార్ పరిశ్రమ నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో మిథున్‌కుమార్ ఎంతవెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

◆ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్, కంబాలపల్లి, ఆరూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

◆ ట్రక్కు ఢీకొని వ్యక్తి మృతి

సంగారెడ్డి: ట్రక్కు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పుల్కల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటకూరు మండల పరిధిలోని శివంపేట గ్రామానికి చెందిన మిరియాల రాములు శివంపేట గ్రామం శివారులో 161 జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా పటాన్‌చెరు వైపు నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న రాజస్థాన్ చెందిన ట్రక్కు రాములు వాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కుమారుడు వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శించి ఆదుకుంటానని భరోసానిచ్చారు.

◆ మెదక్‌లో కాంగ్రెస్ జెండా ఎగిరేస్తాం

కౌడిపల్లి(నర్సాపూర్): మెదక్ ఎంపీగా గెలిచి కాంగ్రెస్ జెండాను ఎగిరేస్తామని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు తెలిపారు. శనివారం మండలంలోని తునికి నల్లపోచమ్మ జాతర సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు శ్రీనివాస్ గుప్తా, కృష్ణాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ వైభవంగా బండ్ల ఊరేగింపు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మకు భక్తులు బండ్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. శనివారం నల్లపోచమ్మ జాతరలో భాగంగా అమ్మవారికి గ్రామ వతన్‌దారులతోపాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బండ్లను ఊరేగించారు. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పురోహితులు శివప్ప, రాజేశ్ అమ్మవారిని పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. దేవాదాయశాఖ అధికారులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు , నాయకులు మానిక్యరెడ్డి ఉన్నారు.